## పోలీసులపై దాడి

కన్నెపల్లి, నవంబర్ 23 : మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఎల్లాకుల మల్లేశ్‌పై బుధవారం రాత్రి నిందితులు దాడి చేసేందుకు వెళ్లగా అతను ఇంట్లో లేక పోవడంతో మల్లేశ్ భార్య సత్తక్కపై దాడి చేశారు. దీంతో సత్తక్క భర్త మల్లేశ్‌కు ఫోన్‌లో విషయం తెలుపగా ఆయన డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ తులసీరాంలు ఘటన స్థలానికి చేరుకొని గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయినా వెళ్లకపోవడంతో పోలీసులు వీడియో తీస్తుండగా సర్పంచ్ ,అతని కుమారునితో పాటు 15 మంది పోలీసుల ఫోన్లు, బైక్ కీ తీసుకొని దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677


నూతనంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్


లక్ష్మిథియేటర్ జంక్షన్ నుంచి వైశ్యభవన్ వరకు నిర్మించిన బైపాస్‌రోడ్, డివైడర్, సెంట్రల్ లైటింగ్

# మంచిర్యాలకు 'మంచి'రోజులు


మంచిర్యాలలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి

- తొమ్మిదిన్నరేండ్లు నిర్విరామంగా సాగిన అభివృద్ధి
- సంక్షేమ పథకాల అమలులో టాప్‌గా మంచిర్యాల నియోజకవర్గం
- 1,49,494 మంది లబ్ధిదారులకు చేరువైన పథకాలు
- కొత్త జిల్లాగా ఏర్పడడంతో మారిపోయిన రూపురేఖలు

మంచిర్యాల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిన్నరేండ్లుగా మంచిర్యాల నియోజకవర్గంలో అభివృద్ధి యజ్ఞం నిర్విరామంగా సాగింది. మంచిర్యాల జిల్లా కావాలనే కలను తెలంగాణ సర్కార్ నెరవేర్చింది. హాజీపూర్, నస్పూర్ కొత్త మండలాలను, ఆ తర్వాత లక్షెట్టిపేట, నస్పూర్‌ను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. ఎవరూ ఊహించని విధంగా మంచిర్యాలకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు వచ్చాయి. రూ.55 కోట్లతో కలెక్టరేట్‌కు అద్భుత సౌధం నిర్మితమైంది. రూ.510 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రానికి ఓ వైపు శ్రీరాంపూర్ నుంచి గద్దెరాగడికి ఓఆర్‌ఆర్ రావడంతో మంచిర్యాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మొన్నటి వరకు మారుమూల ప్రాంతంగా అభివృద్ధికి దూరంగా ఉన్న మంచిర్యాల ఈ రోజు అద్భుతమైన నగరంగా


బస్తీ దవాఖాన

మారింది. గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతానికి పదేళ్లలో మంచి రోజులు వచ్చాయి.

### రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు..

నియోజకవర్గంలో గడిచిన పదేళ్లలో రూ.1500 కోట్లతో 9406 అభివృద్ధి పనులు చేశారు. రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణం, నూతన రహదారుల నిర్మాణం, పట్టణాల్లో సుందరీకరణ పనులు, అంతర్గత రోడ్ల నిర్మాణం ఇలా ఎన్నో పనులు చేశారు. అందులో ముఖ్యమైన పనులు

❖ మంచిర్యాలలో రూ.12 కోట్లతో బైపాస్ రోడ్డు వేశారు. సీసీ రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.

❖రూ.15 కోట్లతో మంచిర్యాల వన్ టౌన్, టూ టౌన్ మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించారు.

❖ రూ.55 కోట్లతో పాత మంచిర్యాల నుంచి ఇందారం క్రాస్‌రోడ్డు వరకు ఆరు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.

❖ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మెరుగుపరిచారు. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో రూ.290.93 కోట్లతో 4468 అంతర్గత సీసీ రోడ్లు, రూ.78.92 కోట్లతో 1688 డ్రైనేజీలు, రూ.87.11 కోట్లతో 111 బీటీ రోడ్లు, రూ.7.63 లక్షలతో 11 వంతెనలు నిర్మించారు.

❖ మంచిర్యాల పాత మార్కెట్ కమిటీ ఆవరణలో మెడికల్ కాలేజీ అనుబంధ 380 పడకల ప్రభుత్వ దవాఖాన, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు సాగుతున్నాయి.

❖ మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేటలో రూ.12.23 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మిస్తున్నారు.

❖ రూ.164కోట్లతో మంచిర్యాల – అంతర్గాం మధ్య గోదావరి నదిపై హైలెవెల్ వంతెనను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇక పనుల ప్రారంభమే మిగిలింది.

❖ రూ.35 కోట్లతో మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస థియేటర్ వరకు ఆరు వరుసల రహదారి నిర్మించారు. రంగంపేట దగ్గర రూ.12కోట్లతో హైలెవెల్ వంతెనకు నిధులు మంజూరయ్యాయి. మూడు మున్సిపాలిటీల్లో రూ.75 కోట్ల ఎస్‌డీఎఫ్ (సీఎం హామీ) నిధులతో విరివిగా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

❖ ప్రస్తుతం మంచిర్యాల పట్టణంలో రూ.15కోట్లతో ఐదు సెంటర్లలో రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నారు. రూ.రెండు కోట్లు వెచ్చించి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు. రూ.17కోట్లతో మంచిర్యాలలో మాతాశిశు దవాఖాన నిర్మించారు. రూ.8 కోట్లతో లక్షెట్టిపేటలో 30 పడకల ప్రభుత్వ దవాఖానను నిర్మిస్తున్నారు.

### పద్దనపల్లి లిఫ్ట్‌తో సస్యశ్యామలం దిశగా...

గోదావరి పక్కనే ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో మంచిర్యాలకు నీళ్లు రాలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరంతో నియోజకవర్గంలోని పంటల పొలాలకు నీళ్లు వచ్చి పచ్చబడ్డాయి. హాజీపూర్ మండలం పద్దనపల్లిలో రూ.80.50 కోట్లతో ఒక టీఎంసీ సామర్థ్యంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. ఇది అందుబాటులోకి వస్తే దాదాపు 8 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. దీంతో పాటు ఇరిగేషన్ శాఖ నుంచి రూ.34 కోట్లతో 4వ కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ లైనింగ్ పనులు చేపడుతున్నారు. దీని ద్వారా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తెలంగాణ వచ్చాక 2015లో పూర్తి చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్‌తో దండేపల్లి, లక్షెట్టిపేట్, హాజీపూర్ మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పద్దనపల్లి పూర్తయితే నియోజకవర్గం మొత్తం కవర్ కానున్నది. మిషన్ భగీరథ కింద మంచిర్యాలలో రూ.59కోట్లతో అర్బన్ పనులు పూర్తి చేశారు. మరో పది శాతం పనులు పూర్తయితే పట్టణానికి పూర్తిస్థాయిలో భగీరథనీరు అందే అవకాశాలు ఉన్నాయి.

### సింగరేణి ఇండ్ల పట్టాలు..

నియోజకవర్గంలోని నస్పూర్–శ్రీరాంపూర్ ఏరియాల్లో సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న 3500 మందికి పట్టాలు ఇచ్చారు. మరో 4500 మందికి కారుణ్య నియామకాలు వచ్చాయి. నస్పూర్ మున్సిపాలిటీలో ఎన్‌హెచ్–63 జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మంచిర్యాల ఐటీఐ ప్రాంగణంలో నూపుణ్యాభివృద్ధి అండ్ శిక్షణ కేంద్రం నిర్మిస్తున్నారు. ఇవే కాకుండా విద్యపరంగా కస్తూర్బా, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఆదర్శ విద్యాలయాలు, మైనార్టీ గురుకుల పాఠశాలలు, మహిళా డిగ్రీ కళాశాల, కేంద్రియ విశ్వ విద్యాలయం, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకువచ్చారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ బడులను బాగు చేస్తున్నారు.

**మంచిర్యాల నియోజకవర్గంలో అందిన**

| సంక్షేమ పథకం | లబ్ధిదారుల సంఖ్య |
|---|---|
| ఆసరా పింఛన్లు | 35,666 |
| కల్యాణలక్ష్మి/ షాదీముబాకర్ | 9,640 |
| సీఎంఆర్‌ఎఫ్ | 4,953 |
| రైతుబంధు | 4,527 |
| రైతుభీమా | 460 |
| టూబీహెచ్‌కే | 290 |
| ఆరోగ్య శ్రీ పథకం | 7,588 |
| గొర్రెల పంపిణీ | 539 |
| కేసీఆర్ కిట్టు | 29,068 |
| దళితబంధు | 100 |
| బీసీబంధు | 300 |
| గృహలక్ష్మి | 3000 |
| కంటి వెలుగు | 49,427 |

# కార్మిక క్షేత్రానికి గులాబీ బాస్

- నేడు మంచిర్యాలలో సీఎం కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'
- బీఆర్‌ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ పర్యటన
- భారీ ఏర్పాట్లు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నిల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ శుక్రవారం మంచిర్యాల జిల్లాకు రానున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఎంపీ వెంకటేశ్ నేతకాని, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభుత్వ విప్ భానుప్రసాద్ కలెక్టరేట్ ముందున్న బహిరంగ సభ ప్రాంగణం, వేదిక పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు అవసరమైన వాహనాలను సైతం పురమాయిస్తున్నారు. దాదాపు 50వేల మందిని సభకు తీసుకువచ్చేలా సిద్ధం చేస్తున్నారు. సభ మధ్యాహ్నం నిర్వహించనున్న నేపథ్యంలో వచ్చే వారు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే వారి కోసం తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఒకవేళ ఎండతో ఇబ్బంది పడకుండా భారీ టెంట్లు వేస్తున్నారు. సీఎం రాక నేపథ్యంలో సభ ప్రాంగణం చుట్టూ పక్కల ప్రాంతాలు గులాబీ మయమైపోయాయి. భారీ ఫ్లెక్సీలు, కటౌట్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు మంచిర్యాలకు చేరుకుంటారు. ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన అనంతరం తిరిగి అదే హెలికాప్టర్‌లో భూపాలపల్లి ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తారు. ఈ మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.